సాక్షి
జగిత్యాల
ఆదివారం । 12 । మార్చి । 2023





## కొండపై భక్తుల రద్దీ

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి పూజలు చేశారు.



## ముగిసిన యాత్రలు

ధర్మపురి: శ్రీవేంకటేశ్వరస్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు ముగిసిపోవడంతో శనివారం రాణాలో ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/19.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నృసింహుని రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

రాయికల్(జగిత్యాల): చెర్లకొండాపూర్ శ్రీ లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం శనివారం కన్నులపండువగా నిర్వహించారు. అర్చకుడు దేవుని నారాయణ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రథంపై ఆసీనులను చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ ఆకుల రాజ్యలక్ష్మీ, ఉపసర్పంచ్ ఏశాల జ్యోతి పాల్గొన్నారు.

### నేరాల నియంత్రణపై దృష్టి

జగిత్యాలక్రైం: చిన్న నేరాలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు, వారిలో సత్ప్రవర్తన తెచ్చేందుకు ఈ పెటీ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ భాస్కర్ అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. చిన్ననేరాలు చేసి పట్టుబడితే కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చి, సక్రమ మార్గంలో నడిపేందుకు వీలుగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రతినెలా జరిగే సమావేశాల్లో ఈ పెటీ కేసుల గురించి వివరిస్తున్నామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అతిచిన్న విషయాలపై దూషించుకోవడం, చేతులతో కొట్టుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేయడం, ప్రజాశాంతికి భంగం కలిగించడం తదితర అంశాల్లో పాల్గొనే వారి నడవడికలో మార్పు తెచ్చేందుకు కౌన్సెలింగ్ ఇస్తామని, తద్వారా నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో గత ఫిబ్రవరిలో ఇలాంటి 349 ఈ పెటీ కేసులు నమోదు చేశామని వివరించారు.

### 'సంజయ్‌ని అరెస్ట్ చేయాలి'


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జగిత్యాలక్రైం: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని అరెస్ట్ చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. పలువురు మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీలతో కలిసి ఆమె శనివారం బండి సంజయ్‌పై చర్య తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్ మాట్లాడిన తీరు మహిళా లోకాన్ని అవమానపర్చేలా ఉందన్నారు. మహిళ హక్కుల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితపై బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు పునుగోటి ప్రశాంతి, జాదవ్ అశ్విని, జగిత్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కల రాధ, ఎంపీపీలు బాదినేని రాజమణి, లావుడ్య సంధ్యారాణి, ఉమారాణి, ములాసపు లక్ష్మి పాల్గొన్నారు.

### ఐఎంఏ సేవలు అభినందనీయం


పోషక కిట్లు అందిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

జగిత్యాల: ఐఎంఏ సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. నిక్షయమిత్ర కార్యక్రమంలో భాగంగా ఐఎంఏ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 50 మంది క్షయ పీడితులకు శనివారం పోషణ కిట్లు అందజేసి మాట్లాడారు. వ్యాధిగ్రస్తులకు పోషణ భత్యం కింద ప్రతినెలా రూ.500 నగదు, దాతల సహకారంతో న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామని తెలిపారు. ఐఎంఏ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్‌కుమార్ మాట్లాడారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎస్సైల బదిలీకి రంగం సిద్ధం?



జగిత్యాలక్రైం: జిల్లాలోని పలువురు ఎస్సైలను బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఒకే పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లు పనిచేసిన వారితోపాటు మరికొందరిని బదిలీ చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఎస్పీగా భాస్కర్ బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ఎస్సైలను బదిలీ చేసేందుకు యత్నాలు చేస్తున్నారు. ఒకేసర్కిల్‌లో పనిచేసిన వారిని కూడా బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైందని తెలిసింది. మరోవైపు.. పలువురు ఎస్సైలు తమకు మరోచోట పోస్టింగ్ వేయించుకునేందుకు ఎమ్మెల్యేల సిఫారసు కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం.



మల్లన్న: ఏం సంగతే ఐలన్న కేంద్రంల పాలు పోశినవానే..
ఐలన్న: ఆ..ఆ.. ఇప్పుడే పోశిన్నే.. కన్నారం పోవాలే పని ఉంది... పోతన్న..
మల్లన్న: ఏ.. నీ.. పోతువుగానీ.. ఆగరాదే. దా ఈడ గూసో.. ఇగో గీ రాజన్న సంగతి చెప్పు కొద్దిగ..
ఐలన్న: ఏమైందే.. రాజన్న ఏం సంగతే.. ఏదో మనాదిగ కనబడతున్నవ్..
రాజన్న: ఏంలేదే ఐలన్న... కొడుకు గురించే రందయితంది. వాడు సదువుకున్నడు గానీ ఇంకా ఏ నౌకరి దొరుకతలేదు.
ఐలన్న: ఏ గదానికి రంది పడతావే.. ఏదో ఒకటి దొరుకుద్ది కదా.. మొన్న రాయమల్లు కొడుకు కన్నారంలో ఓ నౌకరిల చేరిండంట.
రాజన్న: నేనూ గదే అనుకుంటున్ననే కొడుకును కన్నారమన్నా.. పట్నానికన్నా పంపిద్దామనుకుంటున్న. ఇక్కడ ఆగమాగం తిరుగుతుండు.
మల్లన్న: సరేగానీ పగటీలి ఎవరో సార్లు అత్తరంట కదనే. ఈడనే గద్దెకాన్నే అందరూ జమైతరట. ఊల్లే పనుల గురించి మాట్లాడుతరట. ఎగిలివారంగనే సాటింపు జేసింద్రు.
ఐలన్న: ఆ.. అయితే నేనుసుత జెల్దీ కన్నారం పోయస్త. బర్లకు తౌడు.. పిండి బత్తాలు తేవాలే.. మల్లన్న నువ్వు కూడా ఉంటవానే..
మల్లన్న: పొలంకాడికి పోయొస్తనే.. అందరూ జమయ్యే సరికి అస్త. నువ్వు కూడా రాయే రాజన్న.. మనకేమన్న ఫాయిదా ఉంటదో సూద్దాం.
రాజన్న: మంచిదే.. గట్లనే పోయస్త.. మీరూ తొందరగా రండ్రి..

(జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్న రచ్చబండ వద్ద శనివారం ఉదయాన్నే కనిపించిన చర్చా దృశ్యం ఇది)

# మనఊరి ముచ్చట

## వృద్ధులకు పొద్దంతా కాలక్షేపం..

- గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాల వరకు..
- మంచి, చెడులు పంచుకునే వేదిక
- ఊరి అనుబంధాల సూచిక
- ఊళ్లో పంచాయితీలన్నీ ఇక్కడే..
- గ్రామ ఐకమత్యానికి సాక్ష్యం..



హరీబరి జీవితం.. ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్‌తోనే కాలక్షేపం.. పక్కవారి యోగక్షేమాలు పట్టనికాలం.. ఎదుటి వ్యక్తితో కన్నా.. సెల్‌ఫోన్‌లోనే ఎక్కువగా బంధాలను పెంచుకుంటున్న ఈ సమాజంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో రచ్చబండలు అనుబంధాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి.. పొద్దున నిద్రలేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకూ సావటిగద్దె వద్ద చర్చలెన్నో.. ఊరి పంచాయితీలు.. సాదకబాధలు.. గ్రామంలో సమస్యలు.. రాష్ట్ర రాజకీయాలు.. దేశంలో చోటుచేసుకుంటున్న సంఘటలు ఇలా.. నలుగురైదుగురు కలిస్తే చర్చకొచ్చే అంశాలు ఎన్నెన్నో.. ప్రస్తుత బిజీ జీవితంలో చాలా గ్రామాల్లోని రచ్చబండలు కనుమరుగైపోగా.. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ఉదయం.. సాయంత్రం సందడిగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కొన్ని రచ్చబండలపై సండే స్పెషల్..!!

– సాక్షి, కరీంనగర్ డెస్క్

- ఇది జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలోని రచ్చబండ. ఇది గ్రామ పంచాయతీ కార్యాలయానికి పక్కనే ఉంటుంది. పురాతన వేపచెట్టు ఉండగా.. కొన్నేళ్లక్రితం దాని చుట్టూ గద్దె నిర్మించారు. ఈ గద్దెపై ఉదయం, సాయంత్రం గ్రామస్తులతో సందడిగా ఉంటుంది.. ఇక్కడ కూరగాయలు కూడా విక్రయిస్తుంటారు. పంచాయతీలో ఏవైనా సమావేశాలు జరిగినప్పుడు ఈ చెట్టుకింద నిర్వహించేందుకే ప్రాధాన్యం ఇస్తుంటారు.

### ఎన్నో అంశాలకు చర్చావేదిక..

- ఇప్పటికీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని చాలా గ్రామాల్లో రచ్చబండలు ఉన్నాయి. గ్రామంలోని ఓ పురాతనమైన చెట్టు.. దాని చుట్టూ గద్దె.. ఆ గద్దెపై ఎప్పుడూ పదిమంది గ్రామస్తులు మాట్లాడుకోవడం ప్రతీ గ్రామంలో కనిపించే దృశ్యం. పండుగలైనా.. పబ్బాలైనా... గ్రామంలో ఏ సంఘటన జరిగినా పూర్తి సమాచారం ఆ గద్దెవద్దే దొరుకుతుంది. కరెంటు బిల్లుల నుంచి కూరగాయల విక్రయాలు.. వార సంతలు.. గ్రామానికి సంబంధించిన ఏ సమావేశం అయినా ఇక్కడే జరుగుతూ ఉంటుంది. వృద్ధుల కాలక్షేప కబుర్లు.. యువకుల సంభాషణలు.. రైతుల కష్టసుఖాలకు సాక్ష్యంగా నిలుస్తుంది రచ్చబండ. ఆ ఊరికి ఆవే స్వాగత తోరణాలుగా నిలుస్తూ ఉదయం, సాయంత్రం జనాలతో కిటకిటలాడుతున్నాయి.




- ఈ చిత్రం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని రచ్చబండ. ఈ గ్రామంలో గ్రామపంచాయతీ, రచ్చబండ, మహాత్మాగాంధీ విగ్రహాలు పక్కపక్కనే ఉన్నాయి. గతంలో వేపచెట్టు ఉండేది. పదిహేనేళ్ల క్రితం ఆ చెట్టు చుట్టూ గద్దె నిర్మించారు. పంచాయతీ గ్రామసభలైనా.. గ్రామంలోని చిన్నచిన్న సమస్యలైనా ఇక్కడే సమావేశం అవుతుంటారు. నిత్యం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రామంలోని వృద్ధులు ఇక్కడే కూర్చుంటుంటారు. కుశల ప్రశ్నలు వేసుకుంటూ.. గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాలపై గంటలకొద్దీ చర్చలు నడిపిస్తారు.




- వృద్ధులు ఒక్కచోట చేరి ముచ్చటించుకుంటున్న ఈ దృశ్యం తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామం. నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న సమయంలో ఈ గ్రామం ఉదయం పోలీసుల బూట్ల చప్పుళ్లతో మేల్కొనేది. రాత్రి అయితే నక్సలైట్ల పాటలతో ఉత్తేజం పొందేది. కాలక్రమేణ యువత ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టడం.. ఇక్కడున్న వారు వ్యాపారాలు చేస్తుండడంతో గ్రామం అభివృద్ధి బాటపట్టింది. అయితే రచ్చబండ మాత్రం అలాగే ఉంది. ఉదయం అయిందంటే రచ్చబండ వద్దకు వృద్ధులు ఒక్కరొక్కరుగా చేరుకుంటుంటారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా.. ఎలాంటి అభివృద్ధి పనులైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే గ్రామస్తులు సైతం ఇక్కడే సమావేశమవుతుంటారు. గ్రామంలో వందకు వందశాతం వ్యవసాయ కుటుంబాలే కావడంతో ఏ పంటకు ఏ మందు వాడాలనేది కూడా ఇక్కడే సమావేశమై చర్చించుకుంటారు. ఈ గ్రామానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. గ్రామంలో ఏ కులస్తులు చనిపోయినా ఇంటికొకరు చొప్పున వెళ్లి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఉంటారు.



- చాయి తాగుతూ కుశలప్రశ్నలు వేసుకుంటున్న ఈ వృద్ధులది గంభీరావుపేట. నిత్యం ఉదయం, సాయంత్రం చాయి తాగేందుకు ఇక్కడే కలుసుకుంటారు. దాదాపు బస్టాండ్, రామాలయం ఏరియాకు చెందిన దాదాపు పది నుంచి పదిహేను మంది వృద్ధులు ఇక్కడే చేరుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఇరువై ఏళ్లుగా నిత్యం ఇక్కడ కనిపిస్తున్న దృశ్యం ఇది.



- ఇది పెద్దపల్లి జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న పెద్దకల్వలలోని రచ్చబండ వేదిక. పక్కనే ఆలయం.. ఊరి నడిబొడ్డున ఈ వేదిక ఉంటుంది. పురాతన వేపచెట్టు చుట్టూ గద్దె నిర్మించగా.. సాయంత్రం ఆరైందంటే చాలు గ్రామంలోని యువత, వృద్ధులు ఇక్కడికి చేరుకుంటారు. గ్రామంలోని మాటాముచ్చట.. ఇతర రాజకీయాలు చర్చిస్తుంటారు.. సద్దుల బతుకమ్మ ఇక్కడే ఆడుతారు.. దసరా ఉత్సవాలు కూడా ఇదే వేదికగా ఘనంగా నిర్వహిస్తామని సర్పంచ్ వివరించారు.



- పెద్దపల్లి మండలం నిట్టూరులోని రచ్చబండ ఇది.. గ్రామపంచాయతీకి సమీపంలో ఉన్న వేపచెట్టు చుట్టూ గద్దె నిర్మించడంతో గ్రామస్తులు అందరూ ఇక్కడే సమావేశం అవుతుంటారు. కరెంట్ బిల్లులు.. పన్నుల వసూలు ఇక్కడే చేస్తారు. ఉదయం, సాయంత్రం కూరగాయల విక్రయం ఉంటుంది. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఇక్కడికి వచ్చే పరిష్కరించుకుంటారు.



- కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలోని రచ్చబండ ఇది.. గ్రామంలో ఏ సమావేశమైనా ఇక్కడే. దీన్ని గ్రామస్తులు గడికాడి గద్దెగా పిలుచుకుంటారు. గ్రామంలో ఏ పంచాయితీ అయినా ఇక్కడే నిర్వహిస్తారు. గతంలోనే ఈ వేపచెట్టు చుట్టూ గద్దె నిర్మించగా.. ఇప్పుడు ప్రస్తుత యువత సిమెంటు గద్దె నిర్మించి.. ఏటా ఇక్కడ వినాయకచవితికి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు.


### ఇక్కడే కలుస్తుంటాం



మా ఊరులోని ఏ సమస్య అయినా, అభివృద్ధి పనులపై చర్చించాలన్నా వేపచెట్టు కిందనే కలుస్తుంటాం. ఉదయం, సాయంత్రం అవకాశం ఉన్న వాళ్లందరూ గ్రామపంచాయతీ వద్ద గల వేపచెట్టు కిందనే కలిసి మాట్లాడుకుంటుంటాం.

– బత్తుల బాబు, నారాయణపూర్

### మనసున పట్టదు



మేం పోరగాండ్లప్పుడు మా పెద్దోళ్లు ఇక్కడికే వచ్చి ముచ్చట పెట్టుకునేటోళ్లు. ఇప్పుడు పొలం పనులు చేతకాక ఇంటికాడనే ఉంటున్నం. రోజంతా ఇంటి దగ్గరే ఉంటుండడంతో మనసున పట్టక ఇక్కడికొచ్చి దోస్తులం కలుసుకుంటాం.

– ఈరవేని శంకర్, గంభీరావుపేట

### అన్ని ముచ్చట్లు తెలుస్తాయి



వయసు మీద ఉన్నప్పుడు పొలం పనులు చేసేటోళ్లం. అప్పుడు ఇక్కడికి వచ్చే తీరిక లేకుంటే. ఇప్పుడు పనులు చేతనైత లేవు. ఇంటికాడ ఉంటే ఏం తట్టదు. సాయంత్రం అయిందంటే చాలు బస్టాండ్ దగ్గర ఉన్న హోటల్‌కు వస్తాం. నా సోపతోళ్లందరూ ఇక్కడికే వస్తరు. – భాస్కర్‌రెడ్డి, గంభీరావుపేట

# బీఆర్ఎస్, బీజేపీ దొందూదొందే..


అయిలాపూర్ నుంచి పాదయాత్ర ద్వారా కోరుట్లకు బయలుదేరి వస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి


కోరుట్ల సభకు హాజరైన ప్రజానీకం


మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- జీఎస్టీ, 370 ఆర్టికల్స్‌కు మద్దతు ఇచ్చింది బీఆర్ఎస్ కాదా?
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 'వరంగల్ డిక్లరేషన్' అమలు
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసింది సోనియాగాంధీనే..
- కోరుట్ల సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి


నివాళి అర్పిస్తున్న రేవంత్‌రెడ్డి

కోరుట్ల: 'బీజేపీ, బీఆర్ఎస్ దొందూదొందే.. ఆనాడు జీఎస్టీకి, 370 ఆర్టికల్‌కు మద్దతుగా నిలిచింది కేసీఆర్ కాదా?' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం రాత్రి కోరుట్లలో జరిగిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2004లో సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు పార్టీకి నష్టం జరిగినా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తే.. కేసీఆర్ రెండుసార్లు సీఎంగా అధికారం చేపట్టినా వెతలు తీరలేదని విమర్శించారు. రైతులు ఎకరాపై రూ.50వేలు పెట్టుబడి పెడితే చివరికి ఆత్మహత్యలే దిక్కవుతున్నాయని అన్నారు. 'సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఆంధ్రోళ్లకు ఇక్కడి ఎమ్మెల్యే కల్వ కుంట్ల అమ్ముడుపోతే.. పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. మళ్లీ ఆయనకే టికెట్ ఇస్తున్నారంటే ఆంధ్రోళ్ల నుంచి ముట్టిన డబ్బుల్లో సీఎం కేసీఆర్ వాటా ఉన్నట్లే కదా' అని నిలదీశారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు ఏర్పాటులో మాట తప్పిన కవితను పాతాళానికి పంపిన ఘనత కోరుట్ల సెగ్మెంట్‌కు ఉందన్నారు. ప్రజలు తలచుకుంటే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు లెక్కకాదన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కావాలని అసదుద్దీన్ బీఆర్ఎస్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండని కోరారు. ఇళ్లులేని ప్రతీ పేదకు రూ.5లక్షల సాయం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఆడబిడ్డలకు రూ.500కు వంటగ్యాస్, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రేవంత్‌రెడ్డి అభయం ఇచ్చారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తెస్తాం.. పేదల కష్టాలు తీరుస్తామని ఆయన అన్నారు. మీ అందరి ఆశీస్సులతో 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి రత్నాకర్‌రావు, కొంరెడ్డి కరంచంద్, కల్వకుంట్ల సుజిత్‌రావు, జువ్వాడి కృష్ణారావు, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**అధికారంలోకి వస్తే ఐదు లక్షలు..**

కోరుట్లరూరల్: అయిలాపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర సందర్భంగా రేవంత్‌రెడ్డి వివిధ ప్రాంతాల్లో మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు తప్ప బీఆర్ఎస్ పేదలకు నిర్మించిన ఇల్లు ఒక్కటీ లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక అర్హులు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయిలాపూర్ నుంచి కోరుట్ల వరకు సుమారు 6 కి.మీ. వరకు రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. నాయకులు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు, కల్వకుంట్ల సుజిత్‌రావు, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాజేశ్వర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ..**

వేంపేట సింగిల్‌విండో డైరెక్టర్ కొమ్ముల రాజేశ్వర్ రెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. వేంపేటలోని రాజేశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

### పసుపు కొనుగోళ్ల తీరు పరిశీలన

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు కొనుగోళ్లను శనివారం పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఆయన పంటకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు ఎంత పెట్టుబడి, వచ్చే దిగుబడి, ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధరల గురించి రైతులు ఆయనకు వివరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంటకు మద్దతు ధర అందించిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు 'మద్దతు' ఇవ్వడం లేదని తెలిపారు. గతంలో క్వింటాల్‌కు రూ.16వేల ధర చెల్లిస్తే..మూడు, నాలుగు సంవత్సరాల నుంచి ధర రూ.ఏడెనిమిది వేలకు మించి రావడం లేదని చెప్పారు. ఈ సీజన్‌లో రూ.5వేల లోపే చెల్లిస్తున్నారని, దీనివల్ల పంటపై పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గత ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్ రాసి హామీ ఇచ్చారని, కానీ గెలిచిన తర్వాత దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రతియేటా పెట్టుబడి వ్యయం పెరుగుతుంటే..ధర మాత్రం తగ్గుతూ పోతుందన్నారు. పంటకు గిట్టుబాటు ధర అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పసుపు రైతులకు మేలు జరిగేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.

### రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం

కోరుట్లరూరల్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం లభించింది. మల్లాపూర్ మండలం చిట్టాపూర్ నుంచి కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చేరుకోగానే కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. అయిలాపూర్ గ్రామానికి చేరుకోగానే పలువురు మహిళలు బొట్టు పెట్టి మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు.

# సౌర విద్యుత్ యూనిట్లకు రుణాలు

- స్త్రీనిధి ద్వారా మంజూరు చేస్తాం
- రీజినల్ మేనేజర్ వేణుగోపాల్


సౌర విద్యుత్ యూనిట్లు పరిశీలిస్తున్న వేణుగోపాల్

జగిత్యాలరూరల్: సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే మహిళా సంఘాలకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తామని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ వేణుగోపాల్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్ యూనిట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాలు స్త్రీనిధి, సెర్ప్ ద్వారా సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించుకుని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 125 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 75 వరకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 25 దరఖాస్తులు వచ్చాయని, అందులో ఎక్కువగా జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో 9, కోరుట్ల రూరల్‌లో 2 యూనిట్లు ఏర్పాటు చేశారని అన్నారు. ఆసక్తిగల మహిళా సంఘాల సభ్యులు ఏపీఎం, స్త్రీనిధి మేనేజర్, గ్రామంలోని వీఏవోలను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలోనే కల్లెడ గ్రామంలో తొలిసారి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి జిల్లా ఆర్ఎం ఆనందరావు, సర్పంచ్ మహేశ్వర్ రావు, ఎంపీటీసీ పర్శరాం, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, స్త్రీనిధి మేనేజర్ రాణి, వీఏవోలు రమ, మీరాబాయి, యూనిట్ సభ్యులు హేమలత, అరుణ, రమాదేవి, రమ, గంగోత్రి పాల్గొన్నారు.

# పంటల నమోదుకు 'స్పార్టా మ్యాప్'

- రిమోట్ శాటిలైట్ సిస్టమ్ ద్వారా యాప్‌లో వివరాల సేకరణ
- జిల్లాలో 125 ప్రదేశాలు ఎంపిక
- పంటల నమోదులో రానున్న కచ్చితత్వం


పంట నమోదు చేసి సెల్ఫీ దిగుతున్న అధికారి

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రతి సీజన్‌లో గ్రామాల్లో వ్యవసాయ శాఖ ద్వారా పంటల నమోదు చేస్తున్నా అధికారుల లెక్కలకు క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేసిన పంటలకు పోలిక ఉండటం లేదు. దీంతో ప్రభుత్వం పంటల అంచనాను కచ్చితంగా గుర్తించేందుకు ఉపగ్రహ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ ద్వారా స్పార్టా మ్యాప్ యాప్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన విస్తీర్ణం, పంట పేరు చెప్పినా, చెప్పకున్నా, అధికారులు క్షేత్ర స్థాయిలో తిరిగినా, తిరగకున్నా ఆయా గ్రామాల్లో రైతులు ఏ పంటను యే మేరకు సాగు చేశారో తెలియనున్నాయి. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో చేస్తున్న పంటల నమోదును జిల్లా ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. తర్వాత ఆయా మండలాల నుంచి అందిన నివేదికలను రాష్ట్ర స్థాయి ప్రణాళిక అధికారులకు పంపిస్తారు.

**ఇప్పటి వరకు పంట నమోదులో ఇబ్బందులు**

రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ క్లస్టర్ పరిధిలోని ఏఈఓలు ఆయా గ్రామాలకు వెళ్లి సర్వే నెంబర్ల వారీగా వివరాలు నమోదు చేసేవారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు రైతులు మరో పంట సాగు చేస్తుండేవారు. దీంతో ఏ గ్రామంలో యే రైతు ఏ పంట వేస్తున్నారనే విషయాలు తెలిసేవి కావు. ప్రభుత్వ ఒత్తిడి మేరకు వ్యవసాయాధికారులు తూతూమంత్రంగా పంటల లెక్కలు వేసేవారు. క్షేత్ర స్థాయిలో సాగు చేసిన పంటలకు, అధికారులకు లెక్కలకు పొంతన లేకపోవడంతో రసాయన ఎరువులు, విత్తనాల కొరతలు ఏర్పడుతుండేవి. దీనికి తోడు రైతులు పంటను అమ్మకానికి తెచ్చినప్పుడు ఆ పంట సాగు చేయలేదని, తాము కొనమని ప్రభుత్వ సంస్థలు చేతులెత్తేసేవి. ఇప్పుడు అలా జరుగకుండా ప్రత్యేక యాప్ ద్వారా పంట నమోదు నిర్ధారణ చేస్తున్నారు.

**నూతన విధానంలో సర్వే**

పంటల నమోదు కచ్చితత్వం కోసం వ్యవసాయ శాఖ కొత్త యాప్‌ను అందుబాటులోకి తేగా, యాప్ ఉపయోగాలపై వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గత యాసంగి, వానాకాలం సీజన్‌లో ప్రయోగాత్మకంగా అక్కడక్కడా ఉపయోగించగా, ప్రస్తుత యాసంగి నుంచి భూమి సర్వే నంబర్ల వారీగా 125 పాయింట్లు ఏర్పాటు చేశారు. వ్యవసాయాధికారుల స్మార్ట్‌ఫోన్లలో స్పార్టా మ్యాప్ అనే యాప్‌ను డౌన్‌లోడు చేసి ప్రతి అధికారికి ఒక కోడ్‌నంబర్ ఇస్తారు. కోడ్ నంబర్‌తో లాగిన్ కాగానే ఆ ప్రదేశంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు తెలుస్తుంటాయి. సదరు అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి పూర్తి స్థాయిలో హద్దులు గుర్తించి, ఫొటో తీసి అప్‌లోడ్ చేసి వివరాలు నమోదు చేస్తారు. ఈ విధానంలో రైతు వారీగా భూ హద్దులు, సాగు చేసిన పంట వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. ఆయా మండలాల్లోని వాతావరణం, పంటల సాగు, భూమి స్థితిగతులు, ఉత్పాదకత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో పంటల నమోదు అప్‌లోడ్ పాయింట్లను ఏర్పాటు చేశారు.

**ఎప్పటికప్పుడు పర్యవేక్షణ**

క్షేత్ర స్థాయిలోని వ్యవసాయ విస్తీర్ణాధికారులు ప్రత్యేక యాప్‌లో పంటల నమోదు సక్రమంగా చేస్తున్నారా లేదా అనే విషయాలు పర్యవేక్షించేందుకు సర్వే నంబర్ల వారీగా జిల్లా వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించారు. మండల వ్యవసాయాధికారి 40 సర్వే నంబర్లు, ఏడీఏ 40, డీఏఓ 20 నంబర్లను ప్రతీ వారం పరిశీలించాలి. పంటను సర్వే చేస్తున్న అధికారి పంటతో పాటు తన సెల్ఫీని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వ్యవసాయాధికారులు చేసిన పంటల నమోదును జిల్లా ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పంటల సాగు కచ్చితత్వాన్ని పరిశీలిస్తారు.

### పంటల నమోదులో కచ్చితత్వం

వ్యవసాయ శాఖ కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. పంటల నమోదును శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ ద్వారా చేయాల్సి ఉంటుంది. దీంతో పంటల నమోదులో కచ్చితత్వం వస్తుంది. అధికారులు సైతం క్షేత్ర స్థాయికి వెళ్లి సెల్ఫీ ఫొటో అప్‌లోడ్ చేయాలి.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

### ఎప్పటికప్పుడు పరిశీలిస్తాం

వ్యవసాయశాఖ సిబ్బంది చేసే పంటల నమోదును మండలాలు, గ్రామాల వారీగా పరిశీలిస్తాం. పంటల నమోదు కచ్చితత్వాన్ని మేము సైతం యాప్ ద్వారా తెలుసుకుంటాం. తద్వారా నివేదికను రాష్ట్ర స్థాయి ప్రణాళిక విభాగానికి పంపిస్తాం.

– పూర్ణచందర్‌రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి

## క్లుప్తంగా

### విదేశాల్లో ఉద్యోగాలు

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిక్రూటింగ్ ఏజెన్సీగా ఉన్న తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో విదేశాలల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం ఈనెల 13న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్యమ్మ తెలిపారు. కరీంనగర్ ఉజ్వల పార్క్ ఎదురుగా ఉన్న టాస్క్ రీజినల్ సెంటర్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టామని, ఆసక్తిగల అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్ అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91007 98204, 78935 66493, 83286 02231 నంబర్లల్లో సంప్రదించండి.

### మంత్రాల నెపంలో వృద్ధురాలిపై దాడి

మల్యాల(చొప్పదండి): మంత్రాలు చేస్తోందనే నెపంలో వృద్ధురాలిపై దాడి చేసిన తండ్రీకొడుకులపై మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. మండలంలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ఎండీ.దస్తగిరి కుటుంబ సభ్యులు అనారోగ్యం బారినపడగా, అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు బండారి లచ్చవ్వ మంత్రాలు చేస్తోందంటూ గతంలో గొడవలు జరిగాయి. మరోసారి గొడవ చేయమంటూ స్థానిక పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందానికి వచ్చారు. కాగితం రాసిచ్చిన తర్వాత లచ్చవ్వపై తండ్రీకొడుకులు దస్తగిరి, ఇబ్రహీం ఈ నెల 10న కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వారిద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మంత్రాల నెపంలో ఎవరిని వేధించినా, దూషించినా, దాడి చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

### కాంగ్రెస్‌లో రెండువర్గాల మధ్య ఫ్లెక్సీల వివాదం



మెట్‌పల్లి(కోరుట్ల): రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కోరుట్లలో కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు బహిర్గతమయ్యాయి. పీసీసీ అధ్యక్షుడికి స్వాగతం చెబుతూ నాయకులు పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇందులో ఓ వర్గానికి చెందిన కార్యకర్తలు మరో వర్గానికి చెందిన ఫ్లెక్సీని చించివేయడం వివాదానికి దారి తీసింది. వెంటనే విషయం తెలుసుకున్న పార్టీ ముఖ్య నేతలు ఎలాంటి గొడవలు పడవద్దని రెండు వర్గాలకు సూచించి వివాదాన్ని సద్దుమణిగించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మల్లాపూర్(కోరుట్ల): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ రవీందర్, ఎస్సై నవీన్‌కుమార్, ఎంఈవో భీమయ్య, సర్పంచ్ సరికెల లక్ష్మి, ఉపసర్పంచ్ సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మురళీ, నాయకులు సరికెల మహిపాల్, హెచ్‌ఎం నునావత్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బేకరీల్లో నాణ్యత పాటించాలి

జగిత్యాల: ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె ఎల్లం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు బేకరీల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని బేకరీల్లో ఆహార పదార్థాల్లో నాణ్యత, పరిశుభ్రత పాటించడం లేదని, కచ్చితంగా నాణ్యత పాటించాలన్నారు. ఆయన వెంట రాము, అశోక్ ఉన్నారు.

# అయ్యో.. నాన్న

- ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు
- ఇద్దరు మృతి... ఒకరికి తీవ్రగాయాలు
- కొడుకు కళ్లెదుటే పోయిన తండ్రి ప్రాణాలు


తండ్రి మల్లేశం మృతదేహం వద్ద రోదిస్తున్న శ్రీకాంత్


నేరెళ్ల సత్తయ్య మృతదేహం


మల్లేశం(ఫైల్)


నేరెళ్ల సత్తయ్య(ఫైల్)

గంగాధర(చొప్పదండి): పిల్లలందరూ స్థిరపడ్డారు... చిన్నకొడుకుకు పెళ్లిచేస్తే బాధ్యత తీరుతుందని ఆ తండ్రి ఆలోచన. కొడుకుతో కలిసి దేవుడికి మొక్కులు చెల్లించుకునేందుకు బైక్‌పై వెళ్లారు. దర్శనం అనంతరం ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. పదిహేను నిమిషాల్లో ఇల్లు చేరుతారు. ఇంతలో ఘోరం జరిగింది. రెప్పపాటులో రెండు బైక్‌లు ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మరణించగా.. ఎదురుగా ఢీకొన్న బైక్‌పై ఉన్న వ్యక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. క్షణాల్లో విగతజీవిగా మారిన తండ్రి మృతదేహం వద్ద తీవ్రగాయాలతో ఒళ్లంతా రక్తంతో ఆ కొడుకు అయ్యోనాన్న.. మమ్మల్ని విడిచిపోయావా..! అంటూ రోదించిన తీరు కలిచివేసింది. ఈ ఘటన గంగాధర మండలం కురిక్యాల ప్రధాన రహదారిపై ప్రభుత్వ పాఠశాల వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది.

**ఎదురెదురుగా ఢీకొని..**

ఎస్సై రాజు, స్థానికుల వివరాల ప్రకారం.. రామడుగు మండలం గోలిరామయ్యపల్లి గ్రామానికి చెందిన కొలిపాక మల్లేశం(60) తన కొడుకు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గంగాధర వైపు నుంచి కరీంనగర్ వైపు స్వగ్రామానికి వెళ్తున్నాడు. గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల సత్తయ్య(55) కరీంనగర్ వైపునుంచి స్వగ్రామం ఇస్లాంపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కురిక్యాల శివారులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కొలిపాక మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. నేరెళ్ల సత్తయ్య ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలాడు. కొలిపాక శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్సులో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

**కళ్లముందే కన్నతండ్రి మృతి**

రామడుగు మండలం గోలిరామయ్యపల్లి గ్రామానికి చెందిన కొలిపాక మల్లేశం గ్రామంలో కొన్నేళ్లుగా హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిని గ్రామంలో హోటల్ మల్లేశంగా పిలుస్తుంటారు. మల్లేశంకు ఇద్దరు కొడుకులు, కూతురు కాగా.. పెద్ద కొడుకు, కూతురు వివాహాలు అయ్యాయి. చిన్న కొడుకు శ్రీకాంత్ హైదరాబాద్‌లో ప్రయివేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం మల్లేశం చిన్నకొడుకు పెళ్లి చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. మల్లేశం శ్రీకాంత్‌తో కలిసి శనివారం సిరిసిల్ల సమీపంలోని ఓ ఆలయానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో కురిక్యాల పాఠశాల వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని మల్లేశం రోడ్డుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మరో పదిహేను నిమి షాల్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా.. కొడుకు కళ్లెదుటే తండ్రి ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. ఒళ్లంతా గాయాలై రక్తంతో నిండిపోయినా.. శ్రీకాంత్ తనతండ్రి మృతదేహాన్ని చూసి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

**మనుమరాలికి పేరుపెట్టి వస్తూ..**

ఈ ప్రమాదంలో మరణించిన మరోవ్యక్తి నేరెళ్ల సత్తయ్యది గంగాధర మండలం ఇస్లాంపూర్. గీతకార్మికుడు. ఇతడికి ఇద్దరు కొడుకులు, కుమార్తె. అందరికీ వివాహాలు అయ్యాయి. చిన్న కొడుకు తండ్రికి తోడుగా స్థానికంగా వ్యవసాయం చేస్తుంటాడు. కూతురుకు కుమార్తె జన్మించగా.. కరీంనగర్‌లో శనివారం నామకరణ మహోత్సవం నిర్వహించారు. కుటుంబం మొత్తం కార్యక్రమానికి వెళ్లారు. సాయంత్రం కల్లుగీసే సమయం దగ్గరపడుతోందని సత్తయ్య ఒక్కడే ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. కురిక్యాల వద్ద రెండు బైక్‌లు ఢీకొని చనిపోయాడు. శుభకార్యం రోజే ఇంట్లో విషాదం నిండిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా సాధికారితకు సర్కార్ బాటలు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: మహిళల సాధికారితకు బీఆర్‌ఎస్ సర్కార్ బాటలు వేస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం కోరుట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోరుట్ల మున్సిపాల్టీలోని 1,427 మహిళా సంఘాలకు రూ.2,63,99,541 మంజూరు అయినట్లు వివరించారు. అనంతరం వడ్డీ లేని రుణాల చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లత, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, కమిషనర్ ఆయాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**ఆడబిడ్డపై నోరు జారతారా..**

'ఆడబిడ్డపై నోరు జారతారా.. దిగజారుడు మాటలు మాట్లాడతారా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తీరు సరికాదు' అని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీకి ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## ఫకీర్ల ముసుగులో సెల్‌ఫోన్ చోరీ


ఫకీర్లను పట్టుకున్న స్థానికులు

మల్యాల(చొప్పదండి): ఫకీర్ల ముసుగులో సెల్‌ఫోన్ చోరీ చేసి స్థానికులకు చిక్కిన సంఘటన మండలంలోని మానాల గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం టీఆర్ నగర్‌కు చెందిన ముగ్గురు శనివారం మానాల గ్రామానికి ఓ ఆటోలో వెళ్లి దుకాణాల్లో సాంబ్రాని పొగ వేసుకుంటూ యాచన చేస్తున్నారు. ×మీ ఇంట్లో దెయ్యం ఉందని, మీకు మంత్రాలు చేశారు₹ అంటూ ప్రజలను నమ్మిస్తూ ఇంటింటికీ తిరిగారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆమె ఇంటికి వెళ్లి, నయం చేస్తామంటూ నమ్మబలికారు. ఆమె తలపై ఒకరు నెమలి ఈకల కట్ట ఉంచగా, మరొకరు పక్కనే ఉన్న సెల్‌ఫోన్ చోరీ చేశారు. కొద్దిసేపటికే బాధితురాలు సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గ్రహించి, స్థానికులు తెలిపింది. అప్పటికే ఫకీర్లు సెల్‌ఫోన్ తమ వద్ద ఉంచుకుని సిమ్ మరోచోట పడేశారు. స్థానికులు అడ్డగించగా తమకేమీ తెలియదని బుకాయించారు. అనంతరం వారిని మల్యాల పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

## మల్యాల నుంచే రాజకీయ జీవితం


లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితం ప్రారంభించానని, ప్రజల అభిమానంతో నాలుగు దశాబ్దాలుగా ప్రజా సేవలో కొనసాగుతున్నాని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు వెల్మ లక్ష్మారెడ్డికి ఇటీవల మోకాళ్ల శస్త్రచికిత్స కావడంతో శనివారం ఎమ్మెల్సీ పరామర్శించారు. ఈ సందర్భంగా రామన్నపేటలోని పలువురు నాయకులు జీవన్‌రెడ్డిని కలిసి, నాటి రోజులను గుర్తు చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి సేవలందించడమే లక్ష్యంగా చివరి శ్వాస వరకూ సేవలందిస్తానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఆయన వెంట వంశీకృష్ణారెడ్డి, తదితరులున్నారు.

## 'బుగ్గారం సర్పంచ్‌ను సస్పెండ్ చేయండి'

బుగ్గారం(ధర్మపురి): మంత్రి పేరు వాడుకుంటూ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బుగ్గారం సర్పంచ్ మూల సుమలత, ఆమె భర్త ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌ను తక్షణమే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బుగ్గారం వీడీసీ కోర్ కమిటీ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ, తాను గతంలో స్థానిక ప్రజాప్రతినిధుల అక్రమాల గురించి మంత్రికి లేఖ రాశానని, చర్యలు లేకపోవడంతో మరోసారి బహిరంగ లేఖ రాయాల్సి వచ్చిందన్నారు. బుగ్గారం ప్రాంత నాయకులపై మంత్రి దృష్టిసారించి అక్రమాలకు పాల్పడుతున్నవారిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఆయన వెంట వీడీసీ అధ్యక్షుడు చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు సుంకం ప్రశాంత్, విలాసాగరపు నందయ్య, నగునూరి చిన్నరామాగౌడ్, పెద్ద రామాగౌడ్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా నృసింహుని బ్రహ్మోత్సవాలు


స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి:ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొమ్మిదోరోజు శనివారం భారీసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరారు. పుణ్యస్నానాల కోసం తరలివచ్చిన భక్తులతో గోదావరి నది పోటెత్తింది.

**నేడు రథోత్సవం..**

బ్రహ్మోత్సవాల్లో అతిముఖ్య ఘట్టం స్వామివారి రథోత్సవం. ఆదివారం సాయంత్రం ఉత్సవ మూర్తులు యోగా, ఉగ్ర, శ్రీవేంకటేశ్వరస్వాములు, పార్వతీపరమేశ్వరులను రథాలపై ఆశీనులు చేసి రథోత్సవం నిర్వహిస్తారు. ఆలయం నుంచి నందీ కూడలి వరకు శోభయాత్ర నిర్వహిస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

### కెనాల్‌లో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో ఎస్సారెస్పీ కెనాల్‌లో శనివారం గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. సదరు వ్యక్తి కాలకృత్యాలు తీర్చుకోవడానికి మెట్ల మీదుగా కెనాల్‌లోకి దిగాడు. అక్కడ కాలు జారి అందులో పడిపోయాడు. నీటిలో కొట్టుకుపోతుండగా కొందరు గమనించి అతన్ని బయటకు తీశారు. కానీ అప్పటికే అతడు మరణించాడు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, అతడి ఒంటిపై తెలుపు రంగు దుస్తులు ఉన్నాయని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచామని, సంబంధీకులు పోలీ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడు..


రాజన్న(ఫైల్)

ధర్మపురి: మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ సలీం వివరాల ప్రకారం.. మండలంలోని తీగలధర్మారానికి చెందిన జంగిలి రాజన్న (60) తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో శనివారం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

జగిత్యాలటౌన్: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ 9వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర నాయకుడు చింత భూమేశ్వర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 7లక్షల మంది బీడీ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్న కోట్పా చట్టం నుంచి బీడీ పరిశ్రమకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యలపై ఈనెల 13,14న నిజామాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు భీమయ్య, రాజన్న, గంగాధర్, గంగు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ పక్కనున్న తాత్కాలిక గుడిసెల్లో భారీగా రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయి. స్థానికులు శనివారం గమనించి పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. కానీ వారు వచ్చేసరికే సమీపంలో నివసిస్తున్న గుడిసెవాసులు బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు.